ప్రజాశక్తి
గురువారం 11 సెప్టెంబర్ 2025
5
అనంతపురం





సూపర్ సిక్స్-సూపర్ హిట్ బహిరంగ సభావేదికలో ఆశీనులైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బిజెపి అధ్యక్షుడు మాధవ్



కూటమి సభ సూపర్‌హిట్

- భారీగా జనసమీకరణ
- 'అనంత' పసుపుమయం
- చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌తో పాటు జిల్లా మంత్రుల ప్రసంగం
- సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేశామన్న చంద్రబాబు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

'సూపర్ సిక్స్ -సూపర్ హిట్' పేరుతో కూటమి పార్టీలు అనంతపురంలో చేపట్టిన బహిరంగ సభ సూపర్ హిట్ అయ్యింది. రాయలసీమ ప్రాంతీయ సదస్సుకు నాలుగు జిల్లాల నుంచి పెద్దఎత్తున జనం తరలొచ్చారు. నగరం చుట్టూ పసుపు జెండాలు పట్టుకుని తరలిరావడంతో మొత్తం పసుపుమయంగా మారింది. మధ్యాహ్నం 12 గంటల నుంచే జనం బహిరంగ సభ జరుగుతున్న అనంతపురం నగరంలోని ముత్యాల్‌రెడ్డి లేఅవుట్ గ్రౌండ్‌కు చేరుకోవడం ఆరంభమైంది. మధ్యాహ్నానికి మైదానం ఫుల్ అయింది. ఆ తరువాత నగరంలో అనేక చోట్ల వస్తున్న వాహనాలతో ట్రాఫిక్ జామ్ అయింది. మధ్యాహ్నం రెండున్నర గంటలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు వేరువేరుగా హెలీకాప్టర్లలో అనంతపురం నగరం చేరుకున్నారు. వేదికపై వీరిద్దరితోపాటు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్‌లు ఒకేసారి వచ్చారు. సూపర్ సిక్స్ -సూపర్ హిట్ జెండాలను చేతపట్టుకుని ప్రజలకు అభివాదం చేశారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అధ్యక్షతన బహిరంగ సభ ప్రారంభమైంది. మొదట మాట్లాడిన బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ కేంద్ర ప్రభుత్వం ద్వారా రాష్ట్రానికి అందుతున్న సహాకారం గురించి వివరించారు. అదే సందర్భంగా ఈ కూటమి పాలన సుదీర్ఘకాలం కొనసాగాలని ఆకాంక్షించారు. ఆ తరువాత ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రసంగించారు. ఆయన ప్రసంగం పది నిమిషాల్లో ముక్తసారిగానే ముగిసింది. ఆయన శాఖ పరిధిలో అమలు జరుగుతున్న పథకాల గురించి మాత్రమే వివరించారు. చివరగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ప్రసంగం సుదీర్ఘంగా సాగింది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతోపాటు, గడిచిన ఐదేళ్ల వైఫల్యాలను ఈ సందర్భంగా ఎత్తిచూపారు. అధికారం ప్రజలకు సేవ చేయడానికి అని భావించి మెలగాలని మూడు పార్టీల కార్యకర్తలకు ఈ సందర్భంగా హితబోధ చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు వంగలపుడి అనిత, నారాయణ, అచ్చంనాయుడు, నాదేండ్ల మనోహర్, కొలుసు పార్థసారధి, రాంప్రసాద్‌రెడ్డితో పాటు ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎంపీలు అంబికా లక్ష్మినారాయాణ, బికె.పార్థసారధి, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, బండారు శ్రావణి, దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్, కందికుంట వెంకట ప్రసాద్, అస్మిత్‌రెడ్డి, గుమ్మనూరు జయరాం, ఎంఎస్.రాజు, పల్లె సింధూరారెడ్డి, అమిలినేని సురేంద్రబాబుతో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

హంద్రీనీవా పూర్తి చేస్తాం
ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు





హంద్రీనీవా ద్వారా అనంతపురానికి నీరందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పునరద్ఘాటించారు. భైరవానితిప్ప, పేరూరు ఎత్తిపోతల పథకాలను ఈ ఏడాదిలోపు పూర్తి చేసే విధంగా కృషి చేస్తామని తెలిపారు. బహిరంగ సభ ముగింపులో అనంతపురం జిల్లాను ఉద్దేశించి ప్రత్యేకంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రసంగించారు. అదేవిధంగా తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆధునీకరణ పనులను చేపడతామని హామీనిచ్చారు. అనంతపురం జిల్లా అంటే తనకు ప్రత్యేకమైన అభిమానం ఉందన్నారు. ఈ జిల్లాభివృద్ధికి అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటామని భరోసానిచ్చారు.

4వేల కిలోమీటర్ల రోడ్లు వేశాం
ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో 4వేల కిలోమీటర్ల కొత్త రోడ్లు వేశామని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలియజేశారు. సూపర్ సిక్స్ హామీలతో గత ఎన్నికల్లో ఘన విజయం సాధించామని చెప్పారు. ఇప్పుడు దీన్నీ అమలు చేసామని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో ఎక్కడా డోలిమెతలు లేకుండా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. స్థానికంగానే ఉపాధి అకాశాలు కల్పించే పరిశ్రమలు నెలకొల్పే ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు.

క్లెప్టోక్రసీ గ్యాంగ్‌ను భూస్థాపితం చేయాలి
సత్యకుమార్ యాదవ్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి

వైసిపి హయాంలో నింగి, నేల, ధూళి ఇలా పంచభూతాలన్నింటినీ కబ్జా చేసారని రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ విమర్శించారు. క్లెప్టోక్రసి గ్యాంగ్‌లా ఉన్న దీనిని భూస్థాపితం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం యూనివర్శల్ హెల్త్ పాలసీ తీసుకురావడం ద్వారా రాష్ట్రంల ప్రతి పౌరుడు ఉచిత వైద్యసదుపాయాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గడిచిన ఐదేళ్ల వైసిపి పాలన, పరదాలు, బ్యారికెడ్ల చాటున సాగిందని యెద్దేవ చేశారు.

వైసిపివి తప్పుడు ప్రచారాలు
సవిత , బిసి సంక్షేమ శాఖ మంత్రి

వైసిపి చేస్తున్నవన్నీ తప్పుడు ప్రచారాలేనని బిసి సంక్షేమ శాఖమంత్రి సవితమ్మ విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 మాసాల్లో సూపర్ సిక్స్ అమలు చేసి ప్రజలకిచ్చిన మాటలను నిలుపుకున్నట్టు తెలిపారు.





సూపర్ సిక్స్- సూపర్ హిట్ బహిరంగ సభ వేదికపై కూటమి పార్టీల కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నాయకులు





నార్పల ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స నిమిత్తం ఓపీ విభాగం వద్ద వేచి ఉన్న రోగులు

రోగాలున్నా.. వైద్యులు లేరన్నా..!

నార్పల వైద్యశాలలో ఒక డాక్టర్‌తోనే విధులు - సీజనల్ వ్యాధులతో పెరిగిన రోగుల సంఖ్య

ప్రజాశక్తి-నార్పల

ఇటీవల నార్పలలో వైరల్ జ్వరాలు అధికం అవుతున్నాయి. జ్వర పీడితులతో ఆసుపత్రుల్లో ఓపి ఎక్కువగా కన్పిస్తోంది. పిల్లలు, పెద్దలు అన్న తేడా లేకుండా చాలా మంది జ్వరం భారిన పడుతున్నారు. ఇదే సమయంలో నార్పల ప్రాథమిక వైద్యశాలలో ఒకరే డాక్టర్ ఉండడంతో అధిక సంఖ్యలో వస్తున్న రోగులకు వైద్య చికిత్సలు అందించేందుకు ఇబ్బందులు నెలకొన్నాయి. ప్రస్తుతం రోజుకు 200 మందికి పైగా చికిత్సల నిమిత్తం వస్తున్నట్లు తెలుస్తోంది. వైద్యుల కొరతతో గంటల తరబడి వైద్యశాలలోని వేచిచూసే పరిస్థితి ఏర్పడింది. గతంలో నార్పల ప్రాథమిక వైద్యశాలలో ఇద్దరు వైద్యులు ఉండేవారు. వారిలో ఒకరు ఇటీవల బదిలీపై వెళ్లారు. ఆ స్థానంలో కొత్త డాక్టర్ రాకపోవడంతో ఒకరే విధులు నిర్వహిస్తున్నారు. పెరుగుతున్న రోగులతో ఒకరే చికిత్సలు అందించడం కష్టంగా మారిందని వైద్యులు చెబుతున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నార్పల ప్రాథమిక వైద్యశాలకు రెండో వైద్యున్ని నియమించాలని పలువురు కోరుతున్నారు.

'సూపర్ సిక్స్-సూపర్ హిట్'తో ప్రజాధనం వృథా

ప్రచార ఆర్భాటం కోసమే సభ : వైసిపి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

కూటమి ప్రభుత్వం 'సూపర్ సిక్స్-సూపర్ హిట్' పేరుతో అనంతపురంలో నిర్వహించిన బహిరంగ సభకు కోట్ల రూపాయలు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం ఎంతవరకూ సమంజ సమని వైసిపి నాయకులు ప్రశ్నించారు. కంబదూరు మండలంలోని కదిరిదేవరపల్లి గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఆ పార్టీ మండల కన్వీనర్ హనుమంతు రాయుడు మాట్లాడారు. 'సూపర్ సిక్స్-సూపర్ హిట్' సభలో సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ఏ ఒక్కరూ ఆర్‌డిటి ఎఫ్‌సిఆర్‌ఎ పునరుద్ధరణ అంశాన్ని ప్రస్తావించకపో వడం బాధాకరమన్నారు. కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాలకు జీవనాడి అయిన భైరవాణి తిప్ప ప్రాజెక్టుకు నిధుల కేటాయింపుపై ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మాట్లాడకపోవడం చూస్తుంటే ఆయనకు నియోజకవర్గ ప్రజలపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుందన్నారు. బిటిపి భూ నిర్వాసితులకు నష్టపరిహారం ఎప్పుడు చెల్లిస్తారు..? అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ, తదితర అంశాల ఊసేలేదన్నారు. వైద్య కళాశాలలు ప్రైవేట్ పరం చేయడం వల్ల మీ కార్పొరేట్ మంత్రులకు, మీకు ఎంత ఆదాయం వస్తుందో చెప్పాలన్నారు. కార్యక్రమంలో టౌన్ కన్వీనర్ వడ్డే వెంకటప్ప, ఎంపిపి భీమేష్, ఎంపిటిసి కుమార్ ఎంపీటీసీ మారెన్న మూర్తి, కిష్టప్ప, లింగప్ప, రామలింగ, నారాయణ, భాష సురేష్ వైఎస్‌ఆర్సిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

కామ్రేడ్ పిఎస్ శర్మ ఆశయాలను కొనసాగిద్దాం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్



నివాళులర్పిస్తున్న సిపిఐ నాయకులు

దివంగత కామ్రేడ్ పిఎస్.శర్మ ఆశయాలను కొనసాగిద్దామని సిపిఐ నాయకులు అభిప్రాయపడ్డారు. పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో బుధవారం పిఎస్.శర్మ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి గోపాల్, సహాయ కార్యదర్శి నరసింహులు శర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ కళ్యాణదుర్గం ప్రాంతంలో చేపట్టిన భూపోరాటాల్లో పిఎస్.శర్మ కీలక పాత్ర పోషించారని కొనియాడారు. బ్రిటీష్ వారిపై పోరాటం చేసిన ఘనత ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజునాయక్, బుడేన్, లక్ష్మీదేవి, సునీల్, ఎఐఎస్ఎఫ్ నాయకురాలు రజిని పాల్గొన్నారు.

అవసరం మేరకే యూరియా వాడాలి

ప్రజాశక్తి యాడికి

మండల కేంద్రంతోపాటు మండలంలోని నిట్టూరు గ్రామాల్లో రైతులకు యూరియా వాడకంపై భూసార సంరక్షణ శిక్షణ కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు విద్యావతి బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యావతి మాట్లాడుతూ వ్యవసాయ శాఖ సూచించిన మోతాదులో రైతులు యూరియా వాడినట్లయితే పెట్టుబడి తగ్గడంతోపాటు నేల కలుషితం కాకుండా కాపాడుకోవచ్చన్నారు. సంప్రదాయ యూరియా కాకుండా నానో యూరియాను వాడినట్లయితే ఖర్చు తక్కువ, ఎక్కువ రోజులు యూరియా ప్రాముఖ్యత మొక్కలకు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మహబూబ్‌బాషా, మండల వ్యవసాయ అధికారి మహబూబ్‌బాషా, గ్రామ వ్యవసాయ అధికారులు రాంబాబు, నాగలక్ష్మి, రమేష్, యతిషా, పాల్గొన్నారు.

ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-రాయదుర్గం

రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్(ఆర్‌డిటి)కు విదేశీ నిధులకు సంబంధించి ఫారిన్ కాంట్రీబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్(ఎఫ్‌సిఆర్‌ఎ)ను వెంటనే పునరుద్ధరించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాల యం వద్ద అధికారులను కలిసి వినతి పత్రం ఇచ్చారు. నాయకులు మాట్లాడుతూ దేశంలోనే ఉమ్మడి అనంతపురం జిల్లాను అత్యంత కరువు జిల్లాగా గుర్తించి 1969లో ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ స్పెయిన్ దేశం నుంచి అనంతపురం జిల్లాకు వచ్చి ఆర్‌డిటి సంస్థను స్థాపించారన్నారు. 'గంజి' కేంద్రాలు ఏర్పాటు చేసి కరువును జయించిన మహోన్నత వ్యక్తి ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ అన్నా రు. గ్రామాల్లో పేద ప్రజలకు కూడు, గుడ్డ, గూడు లేని పరిస్థితులను దగ్గర ఉండి గ్రహించి ప్రజలతో మమేకమయ్యారన్నారు. సుమారు లక్ష నిరుపేద కుటుంబాలకు ఇళ్లు, కమ్యూనిటీ భవనాలు, స్కూళ్లు నిర్మించారన్నారు. పేద పిల్లలకు విద్యనందించిందన్నారు. అన్ని వర్గాల వారికి ఆసుపత్రులు ఏర్పాటు చేసి కార్పొరేట్‌కు దీటుగా ఆర్‌డిటి ఆసుపత్రుల్లో వైద్యం అందించారన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఆర్‌డిటి జీవనోపాధికి కల్పించిందన్నారు. ఆర్‌డిటి సంస్థ ఉమ్మడి అనంతపురం జిల్లాలో కుల మతాలు, రాజకీయాలకు అతీతంగా విద్య, వైద్యం, వ్యవసాయం, మహిళాభివృద్ధి, కళాకారులు, క్రీడలు, ఉద్యోగ రంగాల్లో వేలాది మందికి విశేష సేవలందిస్తుందన్నారు. ముఖ్యంగా మానసిక వికలాంగులు, విభిన్న ప్రతిభావంతులకు విద్య, వైద్య రంగాలతో పాటు ఇతర రంగాల్లో చేయుత ఇస్తుందన్నారు. ప్రస్తుత పరిస్తితుల్లో ఆర్‌డిటి సంస్థకు కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సిఆర్‌ఎ లైసెన్స్‌ను పునరుద్ధరణ చేయకపోవడంవల్ల ఆయా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోయాయ న్నారు. కావున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అలోచించి ఆర్‌డిటికి వెంటనే లైసెన్స్‌ను కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు గోవిందు, బిఎస్‌పి ఉలిగప్ప, వన్నూరుస్వామి, రమేష్, గంగాధర్, తిప్పేస్వామి, మహేష్, మల్లికార్జున, రోజా, రవి, రాజు పాల్గొన్నారు.

వైసిపి జిల్లా అబ్జర్వర్‌ను కలిసిన మాజీ ఎంపి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

వైసిపి జిల్లా అబ్జర్వర్ నరేష్‌కుమార్‌రెడ్డిని బుధవారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ఆయన నివాసంలో మాజీ ఎంపి, కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రంగయ్య నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి, కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై వైసిపి ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమాలు, రైతుల కష్టాలు, యూరియా కొరత, బ్లాక్ మార్కెట్‌కు తరలింపు, తదితర అంశాలపై ఇటీవల పట్టణంలో చేపట్టిన ర్యాలీ, ముఖ్యమైన సంఘటనల గురించి చర్చించారు. అబ్జర్వర్‌ను కలిసిన వారిలో కళ్యాణదుర్గం, బ్రహ్మసముద్రం మండల కన్వీనర్లు గోళ్ల సూరి, పాలబండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, మున్సిపల్ విభాగం అధ్యక్షుడు దొడఘట్ట మురళి ఉన్నారు.



వైసిపి జిల్లా అబ్జర్వర్‌తో మాట్లాడుతున్న తలారి రంగయ్య

రోగులకు వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి-రాయదుర్గం

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, మాస్ ఎడ్యుకేషన్ స్వచ్ఛం ధ సంస్థ పర్యవేక్షణలో పట్టణంలోని కణేకల్ రోడ్డులో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద బుధవారం వైద్యాధికారి యస్వంత్‌రాజ్ ఆధ్వర్యంలో వివిధ వ్యాధులపై రోగులకు ప్రజలకు అవగాహన శిబిరం నిర్వహించారు. ముందుగా ఎపి సాక్స్, ఐఈసి, హెచ్‌ఐవి/ఎయిడ్స్ పోస్టర్లను వైద్యులు, సిబ్బం ది విడుదల చేశారు. గర్భిణులు, ప్రజలను ఉద్దేశించి వైద్యులు మాట్లాడుతూ హెచ్‌ఐవి/ఎయిడ్స్, సుఖ వ్యాధులు, క్షయ, డ్రగ్స్, మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించారు. హెచ్‌ఐవి/ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష, చిన్నచూపు వద్దన్నారు. అనంతరం హెచ్‌ఐవి/ఎయిడ్స్ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ నీలకంఠ, అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ యస్వంత్‌రాజ్, ల్యాబ్ టెక్నీషియన్ రాజ్యలక్ష్మి, ప్రెవేన్షన్ యూనిట్ అకౌంటెంట్ లోకేష్, ఏ. ఎన్. ఎమ్ లు మరియు,మాస్ ఎడ్యుకేషన్ స్టాఫ్, ఔట్రీచ్ వర్కర్స్, కె.సుధా, ఇందిరమ్మ, పీర్ ఎడ్యుకేటర్స్, తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో ఎయిడ్స్ నియంత్రణ

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మనుషులకు సంక్రమించే ప్రతి వ్యాధిపై కనీస అవగాహన పెంచుకోవాలని రిడ్స్ ప్రాజెక్ట్ మేనేజర్ మహేష్ సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, రిడ్స్ స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని కెజిబివి ఆవరణలో ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రిడ్స్ ప్రాజెక్టు మేనేజర్ మాట్లాడుతూ హెచ్‌ఐవి/ఎయిడ్స్, టిబిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్‌ఐవి/ఎయిడ్స్ సంక్రమణ, జాగ్రత్తలు, నియంత్రణ, నివారణ మందులను సూచించారు. హెచ్‌ఐవి/ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష, చిన్న చూపు తగదని సూచించారు. టోల్ ఫ్రీ నెంబర్ 1097 గురించి తెలిపారు. చెడు వ్యసనాలు, డ్రగ్స్ వాడటం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మహాలక్ష్మి, కిరణ్‌కుమార్, ఎఎన్ఎం వరలక్ష్మి, రిడ్స్ సిబ్బంది నాగరాజు, లక్ష్మీదేవి, మరెక్క, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.


స్తంభించిన ట్రాఫిక్

ఆక్రమణలు తొలగించండి

అడ్డదిడ్డంగా వస్తున్న వాహనాలు-రాయదుర్గంలో నిత్యం ట్రాఫిక్ సమస్య
ఇబ్బందులు పడుతున్న వాహనదారులు-ఇక్కట్లలో ప్రజలు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గంలో రోడ్డు విస్తరణ కంటే ముందుగా ఆక్రమణలు, అక్రమ కట్టడాలను తొలగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. పట్టణంలోని వినాయక కూడలి నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకూ బళ్లారి రోడ్డుపై ప్రయాణం నిత్యం కష్టంగా మారుతోంది. వినాయక కూడలి నుంచి వన్నూరుస్వామి కట్ట వరకు రోడ్డుపై ఇరువైపులా రోడ్డుకు అడ్డంగా ఏర్పాటు చేసిన పెద్ద పెద్ద హోర్డింగులు, ఫ్లెక్సీలు, బ్యానర్లు, మొబైల్ షాపుల టెంట్ల ఏర్పాటుతో వాహనాల రాకపోకలకు అవరోధంగా ఉంటున్నాయి. ఇక్కడే బళ్లారి వైపు నుంచి రాకపోకలు సాగించే ఆర్టీసీ ప్రయివేటు బస్సులు వచ్చివెళ్లేవి. ఇక్కడే ఆగుతాయి. బళ్లారి వైపు నుంచి వచ్చే బస్సులు వినాయక కూడలి వద్ద బస్సు ఆపితే చాలు.. కనీసం ఐదారు ఆటోలు బస్సు చుట్టూ.. ముందూ అడ్డంగా పెడతారు. మరోవైపున ఆటోస్టాండ్.. ఇంకోవైపు బస్సు ఆపడం వల్ల ఇరుగ్గా ఉన్న రహదారిలో వాహనాల రాకపోకలు కష్టంగా మారుతున్నాయి. దీంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. అలాగే బళ్లారి బస్టాఫ్ వద్ద అడ్డదిడ్డంగా బస్సులను ఆపడం, స్థానిక ఆటోలు.. గ్రామాలకు వెళ్లే సెవెన్ సీటర్ డీజిల్ ఆటోలు, టెంపోలు , ద్విచక్ర వాహనాలు తోపుడుబండ్లు, ఎక్కడపడితే పెడుతుండటంతో వాహనాల రాకపోకలు కష్టంగా మారాయి. అలాగే భారీ వాహనాలకు ఊరి వెలుపల బైపాస్ రోడ్డు లేకపోవడంతో భారీ వాహనాలు నిత్యం పట్టణం మీదుగా వెళ్తున్నాయి. దీంతో తరచూ ట్రాఫిక్ జామ్ అవుతోంది. దీనికితోడు బళ్లారి వైపు నుంచి వచ్చే ఆర్టీసీ, ప్రయివేటు బస్సులు రాణిసత్రం బస్టాండ్ కానీ, ఆర్టీసీ బస్టాండ్ కానీ వెళ్లక వినాయక కూడలిలోనే రివర్స్‌లో మలుపు తిప్పుకుంటుండటంతో అక్కడా ఇదే పరిస్థితి. బళ్లారి వైపు నుంచి వచ్చి వెళ్లే బస్సులు వినాయక కూడలి, బళ్లారి బస్టాఫ్‌లో ఆపక, రాణిసత్రంలోని ప్రయివేటు బస్టాండ్ కానీ, అనంతపురం రోడ్డులోని ఆర్టీసీ బస్టాండ్కు కానీ వెళితే ట్రాఫిక్ సమస్య కొంతవరకూ తీరే అవకాశం ఉంది. ఈ విషయమై పోలీసు అధికారులు దృష్టి సారించి ఇక్కడ బస్సులు ఆపకుండా, రివర్స్ చేయకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన స్థానికులు కోరుతున్నారు. వినాయక కూడలి నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకూ రోడ్డుకిరువైపులా ఉన్న స్థల ఆక్రమణలు అక్రమ కట్టడాలను తొలగిస్తే తాత్కాలికంగా రోడ్డు విశాలం అవుతుంది. వాహనాల రాకపోకలకు వీలుగా ఉంటుంది. ఆ దిశగా పురపాలకులు, అధికారులు దృష్టి పెట్టాలని పట్టణ ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలి

జెఎన్‌టియు ప్రిన్సిపల్ చెన్నారెడ్డి


కార్యక్రమంలో పాల్గొన్న జెఎన్‌టియు ప్రిన్సిపల్ చెన్నారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

ఇంజినీరింగ్ విద్యార్థులు ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని జెఎన్‌టియు ప్రిన్సిపల్ చెన్నారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలో మేథా సర్వో డ్రైవ్స్ ప్రయివేట్ లిమిటెడ్ వారు ప్రాంగణ నియామకాలు చేపట్టారు. నియామకాల్లో 118 విద్యార్థులకు రాత పరీక్షను నిర్వహించారు. రాత పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి ముఖాముఖి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు మేథా సర్వో డ్రైవ్స్ ప్రయివేట్ లిమిటెడ్ హెచ్ఆర్ ప్రతినిధి బిందు తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ పి.చెన్నారెడ్డి మాట్లాడుతూ ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకోవడానికి తగిన శిక్షణను ముందుగానే తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాంగణ నియామకాల అధికారి జె.శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

వాతావరణ మార్పులపై అవగాహన

స్టేట్ ప్రోగ్రాం మేనేజర్ శివకిశోర్


హెల్త్ వర్కర్లకు అవగాహన కల్పిస్తున్న వక్తలు

ప్రజాశక్తి-ఉరవకొండ

వాతావరణం మార్పుల వల్ల సంభవించే ఆరోగ్య సమస్యలపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని క్లైమేట్ కేర్ ఛాంపియన్స్ ప్రోగ్రాం స్టేట్ మేనేజర్ శివకిషోర్ సూచించారు. బుధవారం వజ్రకరూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్లైమేట్ కేర్ ఛాంపియన్స్ స్టేట్ ప్రోగ్రాం మేనేజర్ శివకిషోర్ (స్వస్తి) బృందం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేట్ ప్రోగ్రాం మేనేజర్ శివకిషోర్, డాక్టర్ తన్మయి మాట్లాడుతూ వాతావరణ సంబంధిత ఆరోగ్య అవసరాలను తెలుసుకోవాలని కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు సూచించారు. వాతావరణం మార్పుల వల్ల తలెత్తే ఆరోగ్య సమస్యల పట్ల అవగాహన పెంపొందించుకోవాలన్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని సిబ్బందితో గ్రామంలో ప్రజల ఆరోగ్య స్థితిగతులను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ గురుప్రసాద్, సూపర్‌వైజర్ నాగశంకర్, హెల్త్‌అసిస్టెంట్లు నాగరాజు, సంపత్ కుమార్, ఎంఎల్‌హెచ్‌పి భారతి, ఎఎన్ఎంలు జ్యోతి, లక్ష్మి, రాజేశ్వరి, స్టాఫ్‌నర్స్ సుజాత, ఫార్మాసిస్ట్ రామచంద్ర, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మకు నివాళి

నార్పల : చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని మండల రజక వృత్తిదారుల సమైక్య ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని గంగమ్మ ఆలయ ఆవరణలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ తెలంగాణలో భూసాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ వీరత్వం మరువలేనిదన్నారు. అంతేగాకుండా అగ్రవర్గాల దాడులు, భూపోరాటంలో ముఖ్య భూమిక పోషించారని గుర్తు చేశారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నార్పల గ్రామ రజక వృత్తిదారుల సమైక్య నాయకులు పెద్ద బయన్న, నారాయణప్ప, శ్రీనివాసులు, పాపన్నకుమార్, ఎర్నాగప్ప, వెంకటనారాయణ, రాఘవ, వీరనారప్ప, ఆదినారాయణ, గంగాధర్, చంద్రశేఖర్, మల్లికార్జున, కాటమయ్య, పెద్దన్న, ముచ్చుకోట మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ


ప్రజాశక్తి-ఉరవకొండ

మండల పరిధిలోని రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రోగ్రాం అధికారి డాక్టర్ నారాయణస్వామి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే రకార్డులతోపాటు రిజిస్టర్లు తనిఖీ చేశారు. అనంతరం (అసంక్రమిత వ్యాధుల,) 3.0 సర్వే జరుగుతున్న వివరాలు వేగవంతం చేయాలని సూచించారు. నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ పరీక్షలు నిర్వహించడంతోపాటు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి వెంకటేష్‌నాయక్, సిహెచ్ఒ నాగరంగయ్య, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ షఫీ, సూపర్‌వైజర్ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

14న ఉచిత కంటి వైద్యశిబిరం

పామిడి : లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 14వతేదీన స్థానిక శ్రీ భావసార క్షత్రియ కళ్యాణ మండపంలో బెంగుళూరు శంకర కంటి ఆసుపత్రి వారు ఉచిత కంటి మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రభుత్వ ఆయుష్, వైద్యాధికారి డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రఘువీర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య శిబిరానికి హాజరయ్యే వారు రెండు ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తీసుకుని రావాలని కోరారు.

సభ విజయవంతంపై హర్షం


నీళ్ల బాటిళ్లను పంపిణీ చేస్తున్న ఎంపిడిఒ మమతాదేవి, కార్యాలయ సిబ్బంది

నార్పల : జిల్లాకేంద్రంలో నిర్వహించిన సూపర్ సిక్స్-సూపర్ హిట్ సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఆలం నరసానాయుడు, జిల్లా నాయకులు అలం వెంకట నరసానాయుడు బుధవారం ఒక ప్రకటనలో ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సభ సందర్భంగా దాదాపు 500 మందికిపైగా భోజనం, నీటి సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. మండలంలోని ప్రతి పల్లె నుంచి వచ్చి నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. కాగా మండలం నుంచి బస్సుల్లో వెళ్తున్న వారికి ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఏర్పాటు చేసిన నీటి బాటిళ్లను నార్పల క్రాసింగ్ అనంతపురం రోడ్డులో ఎంపిడిఒ మమతాదేవి ఆధ్వర్యంలో ఎంపిడిఓ కార్యాలయ సిబ్బంది పంపిణీ చేశారు.

ఎస్సీ కమిషన్ ఛైర్మన్‌ను కలిసిన డిజిహెచ్ఎస్ఎస్ అధ్యక్షులు

ఉరవకొండ : ఆంధ్రప్రదేశ్ ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ కెఎస్ జవహర్‌ను బుధవారం కొవ్వూరు కార్యాలయంలో దళిత గిరిజనుల హక్కుల సాధన సమితి అధ్యక్షులు గోపాల్ మర్యాద పూర్వంగా కలిసి అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో తొలిసారిగా ఎస్సీ మాదిగ సామాజిక వర్గం నుంచి ఛైర్మన్ పదవిని చేపట్టిన జవహర్‌కు హార్థిక శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో షెడ్యూల్ క్యాస్ట్ ప్రజల సమస్యలపై వచ్చిన వారికి సత్వరమే న్యాయం చేయాలని కోరారు.

పాముకాటుకు గురైన యువకుడు మృతి

బొమ్మనహాల్ : పాముకాటుకు గురై బళ్లారిలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి బుధవారం మృతి చెందాడు. వివరాలు.. మండలంలోని లింగదహాల్ గ్రామానికి చెందిన బోయ రంజిత్(28) మరి కొందరితో కలిసి గత సోమవారం అనంతపురంలోని రుద్రంపేట సమీపంలో ఉన్న ఓ వ్యవసాయ తోటలో పనికి వెళ్లారు. ఆ సమయంలో రంజిత్‌ను పాము కాటు వేసింది. అక్కడ చికిత్స చేయించుకుని స్వగ్రామం రాగా తండ్రి బోయ తిప్పేస్వామి మెరుగైన చికిత్స కోసం బళ్లారికి తీసుకెళ్లగా అక్కడ ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. రంజిత్ భార్య కీర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు జమేదారు కమల్‌బాషా తెలిపారు. రంజిత్‌కు 4 నెలల క్రితం వివాహమైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి దశలవారీ పోరాటాలు

మున్సిపల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్


మహాసభలో మాట్లాడుతున్న మున్సిపల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి దశలవారీ పోరాటాలు చేయనున్నట్లు మున్సిపల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ తెలిపారు. బుధవారం నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో ఎటిఎం నాగరాజు అధ్యక్షతన జిల్లా మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం జిల్లా మహాసభ నిర్వహించారు. ముందుగా గత మహాసభ నుంచి మున్సిపల్ కార్మికులు చేసిన పోరాటాల ద్వారా వచ్చిన విజయాలు.. పరిష్కారంక ఆని సమస్యలు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు దశాబ్దాల తరబడి పని చేస్తున్న ప్రభుత్వాలు బానిసలుగా మార్చేవిధంగా ఔట్ సోర్సింగ్ పేరుతో వెట్టిచాకిరీ చేయిస్తున్నాయన్నారు. మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, ఇంజినీరింగ్ కార్మికుల జీవో 36 ప్రకారం వేతనాలు అమలు చేయాలని, 12వ పిఆర్‌సి అమలు చేయాలని, పర్మినెంట్ కార్మికులకు బాకాయి ఉన్న 4 సలెండర్ లీవ్‌లు వెంటనే ఇవ్వాలని, ఇఎస్ఐ, పిఎఫ్‌లతోపాటు పర్మినెంట్ చేయాలని తీర్మానం చేశారు. కాగా ఆయా సమస్యల పరిష్కారానికి ఈనెల 18వతేదీన రాష్ట్రవ్యాప్తంగా అన్ని మున్సిపల్, పట్టణాల్లో నిరసన ర్యాలీలు, 20, 21, 22వతేదీల్లో రాష్ట్రకేంద్రంలో మూడు రోజులపాటు దీక్షలు, 24న విజయవాడలో మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎటిఎం నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా కె.నాగభూషణ, కోశాధికారిగా బత్తల ఆదినారాయణ, పాధ్యక్షులుగా లక్ష్మీనరసమ్మ (అనంతపురం), రామాంజినేయులు (గుత్తి), రంగనాయకులు (గుంతకల్లు), రామాంజినేయులు (తాడిపత్రి), సహాయ కార్యదర్శులుగా మంత్రి వరలక్ష్మి (అనంతపురం), తిరుమలేష్ (అనంతపురం), రాము (రాయదుర్గం), వన్నూరుస్వామి (కళ్యాణదుర్గం)ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి జిల్లా మున్సిపల్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వైద్యసేవలను సద్వినియోగం చేసుకోండి

వైద్యాధికారి లక్ష్మీచందన


అవగాహన కల్పిస్తున్న లక్ష్మీచందన

ప్రజాశక్తి-ఉరవకొండ

గర్భిణులు ప్రభుత్వ వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారిణి లక్ష్మీచందన సూచించారు. బుధవారం ఉరవకొండ మండల పరిధిలోని పెద్ద కౌకుంట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి మాట్లాడుతూ ప్రతి గర్భిణీ సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. తద్వారా హైరిస్క్ గర్భిణులను గుర్తిస్తే అవసరమైన సేవలందించేందుకు వీలవుతుందన్నారు. అదేవిధంగా ప్రతి గర్భవతి ప్రభుత్వ వైద్యశాలల్లోనే కాన్పులు చేయించుకోవాలన్నారు. అప్పుడే మాతా శిశు మరణాలను నివారించవచ్చన్నారు. డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ యు.వెంకటరమణ మాట్లాడుతూ గర్భిణులు పోషకాహారాన్ని తీసుకోవాలన్నారు. తద్వారా తల్లి క్షేమంగా ఉండటమేకాక బిడ్డ ఆరోగ్యంగా పెరిగి వ్యాధి నిరోధక శక్తిని కలిగి ఉంటారన్నారు. అలాగే గ్రామాల్లో అందుబాటులో ఉండే తాజా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు తీసుకోవాలన్నారు. అదేవిధంగా అంగనవాడీ కేంద్రాల్లో లభించే ఉడికించిన కోడిగుడ్డు, ఖర్జూరాలు, చిక్కీలను తీసుకోవడం ద్వారా రక్తహీనతకు గురి కాకుండా సురక్షిత, సాధారణ కాన్పు కావడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ బి.అరుణకుమారి, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, గర్భిణులు పాల్గొన్నారు.

యాడికి : ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన పథకంలో భాగంగా బుధవారం మండల పరిధిలోని రాయలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రభుత్వ వైద్యులు దేవరాజన్, అప్పయ్య ఆధ్వర్యంలో గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా 20 గ్రామాల నుంచి 38 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 10 మంది గర్భిణులను ఫ్రీ స్కానింగ్ కోసం తాడిపత్రిలోని ప్రయివేటు ఆసుపత్రికి సిఫారసు చేశారు. గర్భిణులు, ఆరోగ్య సిబ్బందికి రాయలచెరువు ప్రముఖ పారిశ్రామికవేత్త రంజిత్‌కుమార్ మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో షబ్బీర్, ఎంపిహెచ్ఎస్ సాయిలత, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

'సూపర్ హిట్'కు తరలిన నాయకులు, మహిళలు



ప్రజాశక్తి-శింగనమల

మండల పరిధిలోని శోధనపల్లి గ్రామం నుంచి బుధవారం అనంతపురంలో నిర్వహించిన సూపర్ సిక్స్-సూపర్ హిట్ భారీ బహిరంగ సభకు నాయకులు, మహిళలు భారీగా తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు లాయర్ ఈశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచు అట్టే రామాంజనేయులు, గ్రామ కమిటీ అధ్యక్షులు ఏకల ఆదినారాయణ, అట్టే శ్రీనివాసులు, జానుగొండ శ్రీనివాసులు, అట్టే శంకర, చిన్న చౌడప్ప, అట్టే కంబయ్య, ఏకల లక్ష్మయ్య, ఈడిగ లక్ష్మయ్య, పాల్గొన్నారు.

పామిడి : అనంతపురంలోన నిర్వహించిన సూపర్‌హిట్ సభకు మండల నుంచి భారీగా తరలివెళ్లారు. గుంతకల్లు, గుత్తి, పామిడి మండలాల నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు తరలారు. ఈ సందర్భగా స్థానిక నేషనల్ హైవే పక్కన ఉన్న లే అవుట్‌లో భోజన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ కత్రిమల ప్రభాకర్‌చౌదరి, బొల్లు శ్రీనివాస్‌రెడ్డి, గౌస్, జింకల సంజీవకుమార్, ముసిలిరెడ్డి, శ్రీరాములు, అప్పన్నగారి కుమార్, కొట్టం మాలిక్, తేల్ బాషా, సురేష్‌రెడ్డి, బొమ్మా మోహన్, సుంకప్ప, నల్లబోతుల శీన, గోవర్ధన్‌రెడ్డి, కరూర్ శివశంకర్, బాబా ఫక్రుద్దీన్, కొండాపురం రఫీ, తదితరులు పాల్గొన్నారు.

యాడికి : ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలవ్యాప్తంగా టిడిపి నాయకులు, కార్యకర్తలు, మహిళలు భారీగా తరలివచ్చారు. తరలివెళ్లిన వారిలో జెసి అభిమాని, విజన్ విద్యాసంస్థల అధినేత విశ్వం, యాడికి మండల బిసి సెల్ అధ్యక్షుడు తిరంపురం నీలకంఠ, టౌన్ ప్రెసిడెంట్ వెలిగండ్ల ఆదినారాయణ, మైనార్టీ అధ్యక్షుడు సుభహాన్, క్లస్టర్ ఇన్‌ఛార్జి మాయకుంట్ల నారాయణస్వామి, సీనియర్ నాయకులు దాసరి రామచంద్ర, గన్నే రమేష్, నంద్యాల రంగస్వామి, వెంకటస్వామి, రహమతుల్లా, బోయ పాండు, రవి, తదితరులు ఉన్నారు.


పామిడి నాయకులతో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్

రాయదుర్గం : అనంతపురంలో బుధవారం కూటమి ప్రభుత్వం నిర్వహించిన 'సూపర్‌సిక్స్-సూపర్‌హిట్' బహి రంగ సభకు మండలం నుంచి కూటమి శ్రేణులు పెద్దఎత్తున తరలివెళ్లారు. రాయదుర్గం నియోజక వర్గం నుంచి టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యాకర్తలు, అభిమానులు ప్రత్యేక వాహనాలు, బస్సుల్లో పెద్దఎత్తున తరలివెళ్లారు. టిడిపి శ్రేణులతో బయల్దేరిన ప్రత్యేక బస్సుల ముందు రాయదుర్గం పట్టణంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్ పచ్చజెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. నియోజకవర్గ వ్యాప్తంగా 200కు పైగా బస్సులు, ఇతర వాహనాల్లో కూటమి శ్రేణులు తరలివెళ్లినట్లు నిర్వాహకులు తెలిపారు.

బొమ్మనహాల్ : మండలంలోని బొమ్మనహాల్, గోవిందవాడ, హొన్నూరు, శ్రీధరఘట్ట, గోనేహాల్, ఉద్దేహాల్, ఉప్పరహాల్, సింగేపల్లి, కొలగానపల్లి, లింగదహాల్, నేమకల్లు, కురవల్లి, చంద్రగిరి, హరే సముద్రం, బొల్లనగుడ్డం, కల్లుహోల, తారకాపురం, కల్లు దేవనహళ్లి గ్రామాల నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సుల్లో తెలుగు తమ్ముళ్లు తరలివెళ్లినట్లు టిడిపి మండల కన్వీనర్ బలరామిరెడ్డి తెలిపారు.

కళ్యాణదుర్గం రూరల్ : ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆదేశాలతో టిడిపి సీనియర్ నాయ కులు దేవినేని ధర్మతేజ సూచనల మేరకు పట్టణంలోని 21వ వార్డు ఓల్డ్ ఎస్సీ కాలనీ అధ్యక్షుడు బేరీల నాగరాజు ఆధ్వర్యంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రత్యేక వాహనాలు, బస్సుల్లో సభకు తరలివెళ్లారు. టిడిపి సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్ నూర్ మొహమ్మద్, కటిక హనుమంతరావు, తెలుగు యువత నాయకుడు బేరీల రాజు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అనంతకు వెళ్లారు.

'సూపర్‌సిక్స్' విజయవంతం చరిత్ర : ఎంపి అంబికా



అనంతపురం కలెక్టరేట్ : సూపర్ సిక్స్ సూపర్ హిట్ విజయోత్సవ సభ అనంత గడ్డపై విజయవంతంగా నిర్వహించడం చరిత్రలో నిలిచిపోతుందని ఎమ్మెల్యే అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం అనంతపురంలో నిర్వహించిన సభలో ఎంపి మాట్లాడుతూ 14 ఎమ్మెల్యే సీట్లు రెండు ఎంపీ స్థానాలను గెలిపించిన ఉమ్మడి జిల్లా ప్రజానీకానికి కృతజ్ఞతలు చెప్పుకోవడం ఆనందంగా ఉందన్నారు. అనంతపురం జిల్లాలో శింగనమల నియోజవర్గంలో గండికోట లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేయడానికి నిధులు మంజూరు చేస్తే నార్పల, పుట్లూరు, యల్లనూరు మండలాల్లో 35వేల ఎకరాలకు సాగునీరు ప్రజలకు తాగునీరు అందే ఆస్కారం ఉందన్నారు. అనంతపురం కార్పొరేషన్ పరిధిలో భూగర్భ డ్రెయినేజీ వ్యవస్థకు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కార్గో ఎయిర్పోర్ట్ కు అనుమతి ఇవ్వాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు.

ప్రాజెక్టులు పూర్తి చేయండి :ఎమ్మెల్యే సునీత



రాప్తాడు : ఉమ్మడి అనంతపురం జిల్లాకు పేరూరు, భైరవానితిప్ప ప్రాజెక్టులు జీవనాడులని వాటి పెండింగ్ పనులను పూర్తి చేయాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత కోరారు. సూపర్ సిక్స్-సూపర్ హిట్ సభా వేదికలో ఆమె మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నారన్నారు. గతంలో ఒక సైకో సీఎం వల్ల రాష్ట్రం అభివృద్ధికి దూరం అయ్యిందన్నారు. గత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో పేరూరు ప్రాజెక్టు కోసం రూ.803 కోట్లు నిధులు మంజూరు చేసి పనులు అప్పట్లో ప్రారంభించామన్నారు. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లలేదన్నారు. భూములు ఇచ్చిన రైతులు పరిహారం కోసం ఎదురుచూసే పరిస్థితిని వైసిపి కల్పించిందన్నారు. ఈ నేపథ్యంలో రైతులకు పరిహారం అందించేలా చూడాలని జలవనురుల శాఖ మంత్రితో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబును విజ్ఞప్తి చేశారు. భైరవానితిప్ప ప్రాజెక్టు కూడా పూర్తి చేస్తే.. ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందన్నారు. జీడిపల్లి నుంచి పేరూరు, భైరవానితిప్ప ప్రాజెక్టులకు నీరు అందించే పనులు ఈ ఏడాదే ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు.

దేశవ్యాప్తంగా మార్మోగిన 'అనంత' పేరు : ఎమ్మెల్యే దగ్గుపాటి


ముఖ్యమంత్రి చంద్రబాబుకు నాగలి బహూకరిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం కలెక్టరేట్ : సూపర్ సిక్స్-సూపర్ హిట్ సభతో అనంతపురం పేరు దేశవ్యాప్తంగా మారుమోగిందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. అనంతపురంలో జరిగిన సూపర్ సిక్స్ – సూపర్ హిట్ విజయోత్సవ సభలో ఎమ్మెల్యే దగ్గుపాటి ముఖ్యమంత్రి చంద్రబాబును ప్రత్యేకంగా కలిసి నాగలిని బహూకరించారు. తర్వాత పవన్‌కల్యాణ్‌ను సత్కరించారు. అంతకుముందు వేదికపై ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు మాత్రమే దక్కుతుందని అన్నారు. అనంతపురం శాసనసభ్యుడిగా తనకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు... తొలి విజయోత్సవ సభను.. ఇక్కడ నిర్వహించే అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. చరిత్రలో నిలిచిపోయే విధంగా ఈ సభకు జనం తరలి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతపురం అభివృద్ధికి సహకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు అనంతపురం ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. అక్టోబర్-2 నాటికి నగరంలో డంపింగ్ యార్డ్ సమస్యకు ముగింపు పలుకుతామని స్పష్టం చేశారు. సభ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ సభకు తాము అనుకున్న దానికన్నా ఎక్కువ స్థాయిలో జనం తరలివచ్చారని అన్నారు. సభా ప్రాంగణం జనంతో కిక్కిరిసిపోవడం వల్ల చాలామంది బయటే ఉండిపోయారన్నారు. కొన్నిచోట్ల ట్రాఫిక్ లోనే జనం ఉండి పోవాల్సి వచ్చిందన్నారు. ఈ స్థాయిలో సభ జరుగుతుందని ఊహించలేదన్నారు. ఇంత పెద్ద ఎత్తున జనం తరలివచ్చి అర్బన్ నియోజకవర్గంలో సభను విజయవంతం చేసినందుకు పేరుపేరునా కృతజ్ఞతలు చెబుతున్నట్లు దగ్గుపాటి తెలిపారు. సభ గ్రాండ్ సక్సెస్ కావడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఎమ్మెల్యే దగ్గుపాటిని ప్రత్యేకంగా అభినందించారు.

పేదలకు మెరుగైన సేవలు : ఎమ్మెల్యే కందికుంట



కదిరి అర్బన్ : పేద, మధ్య మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. బుధవారం అనంతపురం జిల్లాలో ఏర్పాటు చేసిన సూపర్ సిక్స్ సూపర్ హిట్ విజయోత్సవ సమావేశానికి హాజరైన కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రజలకు అందించాల్సిన వైద్యంపై పూర్తి అంశాలను సమావేశంలో వెల్లడించారు. అనారోగ్యం పాలైతే భారం కాకుండా ఆర్థిక ఇబ్బందులను ఎదురుకోకుండా ప్రభుత్వం 25 లక్షల రూపాయల విలువ గల వైద్యం అందించడానికి ఈమధ్య కాలంలోనే మంత్రివర్గం తీర్మానం చేసిందన్నారు.

15 నెలల్లోనే 'సూపర్ సిక్స్' అమలు : ఎమ్మెల్యే శ్రావణిశ్రీ



బుక్కరాయసముద్రం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తెలిపారు. బుధవారం అనంతపురంలో నిర్వహించిన 'సూపర్ హిట్' సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ సూచనలతో రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లను రూ.4వేలకు పెంచడం, మహిళలకు ఉచిత బస్సు పథకం, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, రైతులకు తొలి విడత రూ.7వేలు ఖాతాలో జమ చేయడం, అన్నా క్యాంటీన్ ఏర్పాటు, మెగా డీఎస్సీ నిర్వహణ వంటి ఎన్నో కార్యక్రమాలను అమలు చేశామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుచూపుతో రానున్న కాలంలో మహిళలకు నెలకు రూ.1500, నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి కూడా అందించనున్నట్లు తెలిపారు.

నేరాలు ఘోరాలు

లారీ డ్రైవర్ మృతి


మృతిచెందిన నాగరాజు

తాడిపత్రి రూరల్ : లారీ క్యాబిన్‌లోనే డ్రైవర్ మృతిచెందిన ఘటన మండల పరిధిలోని సజ్జలదిన్నె గ్రామ సమీపంలో బుధవారం ఉదయం చోటు చేసుకుంది. తాడిపత్రి రూరల్ పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. నంద్యాల నుంచి తాడిపత్రి వైపు వస్తున్న లారీ డ్రైవర్ నాగరాజు (42) నంద్యాల నుంచి తాడిపత్రికి వస్తున్న సమయంలో మంగళవారం రాత్రి సజ్జలదిన్నె గ్రామ సమీపంలో లారీ ఆపి రెండు డోర్లు లాక్ చేసుకుని నిద్రపోయాడు. అయితే బుధవారం ఉదయం సుమారు 6 గంటల సమయంలో లారీ ఆపిన ప్రదేశంలో ఉన్న దుకాణాల వారు గమనించి పలకరించారు. లోపల నుంచి ఎలాంటి వినికిడి లేకపోవడంతో తాడిపత్రి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ పోలీసులు లారీ డ్రైవర్ లారీ ఆపి అందులోనే నిద్రపోయి గుండెపోటుతో మృతి చెంది ఉండొచ్చని సిఐ శివగంగాధర్‌రెడ్డి అనుమానించారు. లారీపై ఉన్న ఆధారాలతో యజమానితోపాటు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం మృతుడి బంధువుల, వీఆర్వో సమక్షంలో తాళం తీసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు రూరల్ పోలీసులు తెలిపారు.